# సాహిత్య తరంగిణి
## (తెలుగు పరిశోధన పత్రిక)

**ISSN: 3048-5908 Impact Factor:3.63(SJIF)**

**A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, April, 2024, pp.27-33**


# విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘర్షణకు అద్దం పట్టిన నవల 'అంపశయ్య'


**బట్టు విజయ్ కుమార్**

పరిశోధక విద్యార్థి

కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్



**ఉపోద్ఘాతం:**

మనోవిశ్లేషణకు ప్రాధాన్యమిచ్చిన నవలలు ప్రపంచవ్యాప్తంగా 19వ శతాబ్దం నుండి ప్రారంభమయ్యాయి. తెలుగులో మాత్రం 20వ శతాబ్దంలో మొదలయ్యాయి. చైతన్యస్రవంతి నవలలు ఇతర నవలలకంటే భిన్నమైనవి. నవీన్ వ్రాసిన 'అంపశయ్య' నవల 1969 లో అచ్చయింది. వీరి ఇతర రచనలు 'ముళ్ళ పొదలు', 'బాంధవ్యాలు', 'కాలరేఖలు', 'చెదిరిన స్వప్నాలు', 'చీకటి రోజులు' కంటే 'అంపశయ్య' నవల ఎక్కువ పాఠకాదరణ పొందింది. 'సాహిత్య వ్యాసాలు', "మనోవైజ్ఞానిక నవలల విశ్లేషణ" పేరిట రాసిన విమర్శలు సంకలనాలుగా వచ్చాయి. ఇతని 'కాలరేఖలు' నవలకు కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు (2004) వచ్చింది. ఇతనికి పేరు తెచ్చిపెట్టిన నవల 'అంపశయ్య'. దీంతో నవలా రచయితగా సాహిత్య లోకానికి పరిచయం అయ్యారు. ఈ నవల ద్వారానే ఇతనికి అంపశయ్య నవీన్ అనే పేరు స్థిరపడింది.



**కీలకపదాలు:** సంఘర్షణ, విశ్వవిద్యాలయ, విద్యార్థి, ప్రత్యేకతలు


**'అంపశయ్య' నవల -నేపథ్యం:**

'అంపశయ్య' వెలువడి 48 సంవత్సరాలు గడిచిపోయినా ఈ నవలకు మాత్రం ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. అందుకు నిజజీవితంలో జరిగే విషయాలను కథా వస్తువుగా తీసుకోవడం, మనిషి అంతరంగంలో జరిగే సంఘర్షణల్ని చిత్రించడం ప్రత్యేకతలు. ప్రతివ్యక్తి లోపల ఉండే భయం, మానసిక అందోళనలు, పిరికితనం వల్ల మనసు చంచలమైపోవడాన్ని నవలా రూపంలో చక్కగా చిత్రించారు. నవలలో ఈ సంఘర్షణ చిత్రణతో పాటు ఆనాటి రాజకీయ విషయాలను ప్రస్తావించారు.

**'అంపశయ్య' నవల -విద్యార్థి జీవన చిత్రణ:**

ఈ నవల ఒక విశ్వవిద్యాలయంలో జరిగిన విద్యార్థి జీవితాన్ని చిత్రిస్తుంది. ఒక పేద కుటుంబం నుంచి వచ్చిన విద్యార్థి విశ్వవిద్యాలయంలో ఎదుర్కొనే సమస్యలు, విశ్వవిద్యాలయంలో జరిగే సంఘటనలు ఇందులో ప్రతిఫలిస్తాయి. దీన్ని 'చైతన్య స్రవంతి' రచనా పద్ధతిలో రచించారు.

చైతన్య స్రవంతి అంటే "బాహిర జగత్ సంపర్కంవల్ల మనస్సులో ఏర్పడే ముక్తానుషంగాల ప్రవాహాన్ని సాహిత్య రూపకంగా నమోదు చేసే పద్ధతిని చైతన్యస్రవంతి అని పిలుస్తున్నారు"!

పాత్రల 'ముక్తానుషంగాన్ని' చిత్రించటానికి రచయిత నవీన్ చైతన్యస్రవంతిలో ఉండే కొన్ని పద్ధతుల్ని సృష్టించుకున్నారు. అందులో ముఖ్యమైనవి. అవి

1. అంతరిక స్వగతాలు
2. రచయిత సర్వజ్ఞత్వం
3. చలనచిత్రాల్లో వాడే టెక్నిక్స్
4. యాంత్రిక విధానాలు
5. మాట తడబడడం

ISSN: 3048-5908 Impact Factor:3.63(SJIF)
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, April, 2024, pp.27-33

**1. అంతరికస్వగతాలు**

ఈ అంతరిక స్వగతాలు (Inner talk) అనేవి చైతన్య స్రవంతి సాహిత్యంలో చాలా ప్రముఖ పాత్ర వహిస్తాయి. స్వగతం అనేది నాటకాల్లో ఉంటుంది. చైతన్య స్రవంతిలో ఉండే ఈ అంతర స్వగతాలు స్పష్టంగా ఒక క్రమపద్ధతిలో ఉంటాయి. రచయిత ఈ స్వగతాల్ని పాత్రల ఉపచేతనను, సుప్తచేతనను ప్రదర్శించటానికి ఉపయోగిస్తారు. కాబట్టి ఇవి గజిబిజిగా, క్రమం లేకుండా, గందరగోళంగా ఉంటాయి. మనసులో పల ఉత్పన్నమయ్యే ఆలోచనలను బయటికి చెప్పాలనుకున్నప్పుడే వాటికి భాషా రూపం ఇవ్వవలసి ఉంటుంది. అప్పుడే వాటికొక క్రమపద్ధతి, స్పష్టత యేర్పడతాయి.

ఈ అంతరిక స్వగతాల్ని మళ్ళీ రెండు భాగాలుగా విభజిస్తారు. అ) ప్రత్యక్షఅంతరికస్వగతం. ఆ) పరోక్షఅంతరికస్వగతం.

పాత్ర మనసులో ఉత్పన్నమౌతుండే ఆలోచనల 'వాక్పూర్వదశ'ను మధ్యలో రచయిత జోక్యం చేసుకోకుండా, పాఠకుల ముందుంచటాన్ని 'ప్రత్యక్ష అంతరిక స్వగతం' అంటారు. 'పరోక్ష అంతరిక స్వగతం'లో రచయిత అప్పుడప్పుడు పాఠకులకు కొంచెం సహాయపడ్తాడు.

**2. రచయిత సర్వజ్ఞత్వం**

సర్వజ్ఞత అనేది సాంప్రదాయ సాహిత్యంలోను ఉంటుంది. ఈ తరహా రచనల్లోను ఉంటుంది. సర్వజ్ఞత అంటే రచనకు అందులోని పాత్రలకు సంబంధించినంత వరకు అన్ని విషయాలు తెలుసుకోవడం. తెలిసి ఉంటడం. రచయిత అన్ని చోట్లా ఉంటాడు (onmi-present). అయితే సాంప్రదాయ సాహిత్యంలో రచయిత ప్రతిచోట కనిపిస్తాడు. కానీ, చైతన్య స్రవంతిలో రచయిత చాలా తక్కువగా కనిపిస్తాడు. ఒక పాత్ర మనస్సులో పలిపొరల్లో యేంజరుగుతున్నదో రచయితకు తెలుసు. ఇందులో రచయిత తననుతానే ఒకపాత్రగా మలచుకొని వాస్తవికతను పోషించటానికి పాటుపడ్తాడు. ఇదే విషయాన్ని మరోలాచెప్పాలంటే ఆత్మాశ్రయమైన ఇతివృత్తానికి వస్త్వాశ్రయ రూపం ఇవ్వటానికి ప్రయత్నిస్తాడు(Objective Presentation of Subjectivity)

**3. చలన చిత్రాల్లో వాడే టెక్నిక్స్**

సినిమాల్లో వాడేకొన్ని టెక్నిక్లు ఈ నవలల్లో విరివిగా వున్నాయి.

**ఫ్లాషాబ్యాక్:** పాత్ర మనసు అకస్మాత్తుగా గతంవైపు మళ్ళటాన్ని చిత్రించే పద్ధతి.

**క్లోజప్**: ఒక పాత్రను కేంద్రంగా తీసుకొని ఆ పాత్ర మనస్సంచారాన్నే క్షుణంగా ప్రదర్శించటం.

**మల్టిపుల్ వ్యూ:** ఒకేసారి మనస్సులోని వివిధ భావాలను చేతన, ఉపచేతన, సుప్తచేతనలను ఒకదాని వెనుక మరొక దానిని చూపించటం.

**కటింగ్**: ఒక దృశ్యాన్ని ఆకస్మాత్తుగా ఆపెయ్యటం.

సినిమాల్లో వాడబడే ఈటెక్నిక్స్ తమ రచనల్లో విరివిగా వాడటం ద్వారా చైతన్య స్రవంతి చిత్రణకు అసాధ్యమైన మనస్సంచారాన్ని చిత్రించడం.

**4. యాంత్రిక విధానాలు**

విరామ చిహ్నాలైన ఫుల్స్టాప్, కామా మొదలైన వాటిని తొలగించటం ద్వారానో, లేకకొన్ని మాటల్ని విచిత్రమైన పద్ధతుల్లో ప్రింట్ చేయ్యటం ద్వారానో రచయిత తను అనుకున్న ప్రయోజనాన్ని సాధించటాన్ని యాంత్రిక విధానాలంటారు.

**5. మాటలు తడబడడం**

రచనలో కొన్ని ప్రత్యేకమైన వాచక విధానాల ద్వారా పాత్రల చైతన్య మెలాప్రవహిస్తున్నదో వివరించవచ్చు. పాత్రల మనసులో కొన్ని మాటలు ప్రత్యేకంగా చోటు చేసుకోవటం లేక ఒక మాట మరో మాటలో కలిసిపోవటం మొదలైన వాటిని వాచక విధానాలంటారు. ఒక మాట మరొక మాటతో కలిసిపోయి కొత్త ఉచ్చారణను పొందుతుంది. కొన్ని సార్లు ఒక మాట ఇంకోమాటగా మారుతుంది. కొన్ని మాటలు పదే పదే రిపీట్ అవుతాయి. ఒక భాషాపదం ఇంకో భాషాపదంతో కలిసి విచిత్రమైన రూపాన్ని పొందుతుంది. ఇలా శబ్దాలతో చాలా విచిత్రమైన ప్రయోగాలు చెయ్యటం చైతన్యస్రవంతి సాహిత్యంలో తరచుగా కనిపిస్తుంది.

**ISSN: 3048-5908 Impact Factor:3.63(SJIF)**

**A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, April, 2024, pp.27-33**


**ఇతివృత్తం**

ఇది ఆలోచనల పరంపరలకు అందనిది. ప్రవాహంగా పరుగెతుడుంది. ఆలోచనలు ఘర్షణ, సంఘర్షణకు లోనవుతాయి. క్షణక్షణం మారుతూ ఉండే మనిషి జీవితాన్ని నవీన్ ఈ నవలలో చిత్రించారు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రవి ఒక హాస్టల్ స్టూడెంట్. రవి ఎం.ఏ పొలిటిక్స్ చదువుతున్నాడు. ఒక రోజు రవి తన రూమ్లో నిద్రపోతున్నప్పుడు తను నదిలో పడి మునిగిపోతున్నట్లు, ప్రవాహంలో కొట్టుకుపోతున్నట్లు కలవచ్చింది. గట్టిగా అరుద్దామంటే గొంతు పెగలటం లేదు. తనతల్లి రవికి చేయి అందించినట్లు, నీటిలో ఆమె కొట్టుకుపోతున్నట్టు. 'నన్ను వదిలి వెళ్ళొద్దమ్మ' అని రవి గట్టిగా అరుస్తూ కళ్ళు తెరిచిచూస్తాడు. బాత్రూంలో ఎవరో స్నానం చేస్తున్నారు. షవర్ చప్పుడు. తనూ కలగన్నానని తెలుసుకున్నాడు. కడుపులో ఆకలి. రాత్రి ఏమి తినలేదు. లేచాకా పళ్ళు తోముకోవడానికి "టూత్పేస్ట్" లేదు. కొందామంటే డబ్బులేదు. ఎవరినైన అడగాలంటే అభిమానం అడ్డు. తాను మళ్ళీ పడుకున్నాడు. తన కాళ్ళను ఎవరో లాగుతున్నట్లు, ఎవరో నిమురుతున్నట్లు అనిపించింది. కళ్ళు తెరిచి చూస్తే గుర్నాధం. అతనో సెక్సువల్ పార్వర్ట్. అతని సహాయం తీసుకోవడం రవికి ఇష్టంలేదు. కానీ, తప్పని పరిస్థితిలో అడగటం తప్పటం లేదు. లేచి చదువుకోవాలని అనుకుంటాడు. కానీ, చదవడు. తన మనసులో ఆలోచనల పరంపరలు సాగుతున్నాయి. బయటికి వచ్చి 'బాత్రూం' మీద సెక్స్ రాతలు ఎవడో రాశాడు. మధు, సరళ ప్రేమించుకుంటున్నారని విన్నాడు.

రవి జవహర్లాల్ నెహ్రూగారి భావాలను నమ్మేవాడు. ఈ సిద్ధాంతాల విషయంలో రవికి, రెడ్డికి మధ్య గొడవలు అవుతాయి. రెడ్డి డబ్బులు ఉన్నవాడు. డబ్బు చూపి తన గ్యాంగులో కొందరిని చేర్చుకునేవాడు. రవి కాలేజికి వెళ్ళే దారిలో రెడ్డిగ్యాంగ్ నిలబడి ఉంటుందని తనని కొడతారని భయపడుతుంటాడు. రెడ్డిగ్యాంగ్ నిజంగానే నిలబడి ఉంటుంది. రవి వాళ్ళను దాటివెళ్ళిపోతాడు. వెనక నుండి రవీ! అన్న పిలుపు వినబడుతుంది. తిరిగి చూస్తే మురళి. ఇద్దరూ కలిసి మాట్లాడుకుంటూ కాలేజికి వెళ్తారు. నళిని పుస్తకాలను తన ఎద మీద మోసుకొస్తుంది. ఆమెకు చిన్న పిల్లలను ఎత్తుకోవాలనే కోరిక ఉందంటూ అందరూ కామెంట్స్ చేస్తారు. అంతలో లెక్చరర్ వస్తాడు. క్లాస్ అయిపోయిన తరువాత మురళి, రవి కలిసి చదవడానికి లైబ్రరీ వెళ్తారు.

అక్కడికి కిరణ్మయి వారి స్నేహితులతో కలిసి వస్తుంది. 'సినిమాకి వెళ్తున్నాం సినిమా పేరు కాగజ్ కే ఫూల్ అని చెప్తుంది. రవి 'చాలా మంచి సినిమా, చూడదగ్గ సినిమా'నని చెప్తాడు. కిరణ్మయి రవికి రమ్మని చెబుతుంది. రవి సరేనంటాడు. కానీ, రవి దగ్గర డబ్బు లేదు. మురళిని అడుగుతాడు. మురళి లేవని చెప్తాడు. రవి ఎవరి దగ్గర అడగాలో అర్థం కాదు. చటుక్కున గుర్నాధం గుర్తుకు వస్తాడు. ఆ వెధవ దగ్గర అడగవద్దని మనసులో అనుకుంటాడు. బస్టాండులో నిలబడుతాడు. పిచ్చిది డబ్బులు అడుగుతుంది. లేవని పంపిస్తాడు.

ఆమెకి రవికి అవినాభావ సంబంధం ఉన్నట్టు అనిపిస్తుంది. బస్సు వెళ్ళిపోతుంది. బస్సెకి కండక్టర్ని స్టైల్గా 'అల్రెడి టికెన్' అనేయాలనుకుంటాడు. మళ్ళీ నామూషిగా 'ఫీల్' అవుతాడు. మరో బస్సు వస్తుంది. అటు నుండి గుర్నాధం వస్తాడు. అతన్ని డబ్బులు అడుగుతాడు. అతడు లేవంటూ జేబులో చేయి పెడతాడు. రవి గుర్నాధం జేబులో చెయ్యి పెట్టి 5 రూపాయల నోటును తీసుకుని బస్సెక్కుతాడు. బస్సులో నిద్రపోయినప్పుడు ఒక కలవస్తుంది.నాగార్జున సాగర్కి విహార యాత్రకు వెళ్ళిన సంగతులు ఆ కలలో కదులుతాయి. కిరణ్మయి చీర కట్టుకుని వచ్చింది. రవికి ముందరి సీటులో కూర్చుంది. రవి కిరణ్మయి బెంగాలి రచయిత శరత్ నవల గురించి మాట్లాడుకున్నారు. నాగార్జున సాగర్ చేరుకున్నారు. అందరూ సొరంగంలో నడుస్తున్నారు. అందులో రవి, కిరణ్మయి పక్కపక్కనే నడుస్తున్నారు.

అందులో దీపాలు మినుకు మినుకుమంటున్నాయి. రవి కరెంటు పోతే బాగుండు. కిరణ్మయి తనను హత్తుకుంటే బాగుండని మనసులో అనుకుంటాడు. వెంటనే కరెంటు పోతుంది. కిరణ్మయి రవిని గట్టిగా పట్టుకొని వాటేసుకుంటుంది. అరుస్తుంది. అంతలో కరెంటు వచ్చేస్తుంది. కిరణ్మయి ఏమి ఎరుగనట్లు తలవంచుకుని నిలబడుతుంది. రవి ఆనందానికి అవధులు లేకుండాపోతాయి. అంతలో కండక్టర్ కోఠి వచ్చిందని లేపుతాడు. రవి కల చెదిరిపోతుంది.

**ISSN: 3048-5908 Impact Factor:3.63(SJIF)**

**A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, April, 2024, pp.27-33**


రవి కోఠి నుండి రిక్షాలో సినిమా హాలికి వెళ్తాడు. రిక్షావాడు ఒక్కరూపాయి అడుగుతాడు. రవి కోపంతో ఇచ్చేస్తాడు. సినిమా ఇంకా మొదలు కాలేదు. కరెంటు లేదు. కిరణ్మయిని కలుసుకుంటాడు. అంతలో కిరణ్మయి కోసం సతీష్ వస్తాడు కారులో. కిరణ్మయి అతనితో వెళ్ళిపోతుంది. రవికి బాధేస్తుంది. ఏం చెయ్యాలో తోచదు. అక్కడి నుండి హాస్టల్కి బయలుదేరుతాడు. వస్తున్నప్పుడు ఫుట్పాత్ మీద పాత పుస్తకాలు చూస్తాడు. 'మర్లిన్ మన్రో లైఫ్' అనే పుస్తకం కొంటాడు. ఆ పుస్తకాన్ని దక్కించుకున్నందుకు సంతోషంగా ఉన్నాడు రవి. తననూ ఆకలి దహిస్తుంది. తన దగ్గర సరిపడ డబ్బులు లేని సంగతి గుర్తుకు వచ్చింది. పక్కనే ఒక హెూటల్ కనబడుతుంది. అందులో వెళ్ళి, తిని బిల్లుకట్టకుండా పారిపోయి వచ్చేయాలని అనుకుంటాడు. ఒక యాపిల్ బండి కనబడుతుంది. ఆకలితో ఉన్న రవికి అవి ఎత్తుకుని పారిపోవాలని అనుకుంటాడు మనసులో. కానీ, పక్కనే ఉన్న పిల్లవాడు 'పండ్లు కావాలా సార్'? అని ప్రశ్నించగానే తెరుకుని అవసరం లేదంటూ ముందుకు కదిలిపోతాడు. వెంటనే తనకు తన ఉపేంద్రసార్ గుర్తుకువస్తాడు.

రవి ఉపేంద్రబాబును కలిసి తన విశ్వవిద్యాలయంలోని సంఘటనలని, పరిస్థితులని వివరించాడు. రవి ఆకలిని గమనించి ఒక గ్లాసు 'బోర్నవిట' ఇస్తాడు. దాని తాగుతూ ఉపేంద్రబాబు చెప్పిన మాటలు వింతగా వింటాడు రవి. "రవి నువ్వు పల్లెటూళ్ళలాగా అమాయకంగా ఉండకూడదు. 'పాసిటివ్'గా ఉండాలి. ఈ పట్నంలో అందరు 'మైండ్ గేమ్ అడతారు. నువ్వు వారిని అదేవిధంగా కొట్టాలి" అని చెప్పాడు. రవికి ఉపేంద్రబాబు మాటలు నమ్మకాన్ని ఇస్తాయి. విశ్వవిద్యాలయానికి నడుచుకుంటు వస్తాడు.

రవి తన ఊరు, అమ్మా నాన్నలు కళ్ళ ముందు కదులుతారు. ఇంటి వద్ద వారి దీనస్థితిని తలుచుకుంటాడు. తనకోసం ఇంట్లో ఉన్న లేగదూడను అమ్మి రవికి డబ్బులు ఇస్తారు. తన చెల్లి పట్నం నుండి జడల రిబ్బన్లు తీసుకురమ్మంటుంది. వారు ఇచ్చిన డబ్బులు తీసుకుని వస్తే వరంగల్లో ఫ్రెండ్స్ నువ్వు హైదరాబాద్లో విశ్వవిద్యాలయానికి వెళ్తున్నావని పార్టీ అడుగుతారు. రవి వాళ్ళని ఎలా హింసించాడో గుర్తుకువస్తుంది. చాలా బాధ పడతాడు. అలా ఆలోచిస్తునే రవి రూంకి వస్తాడు.

రమేష్ రూంలోకి వస్తాడు. తనూ తీసిన న్యూడ్ (Nude photos) ఫోటోలు రవికి చూపెడతాడు. ఆ ఫోటోలు బస్టాండులో కనిపించిన పిచ్చిదానివి. ఆమెను తిండిపెట్టి ఒప్పించానని చెపుతాడు రమేష్. అప్పుడు రవికి తన ఊరిలో ఉన్న రత్తి గుర్తుకువస్తుంది. రత్తి విషయం రమేష్కి చెబుతాడు.

రత్తి ఊరిలో తక్కువ కులస్తురాలు. రత్తి వాళ్ళ నాన్న భూస్వామి దగ్గర పనిచేస్తాడు. ఆ భూస్వామి దగ్గరే అప్పు చేస్తాడు. ఆ అప్పు కట్టకపోవడంతో రత్తిని కోరుతాడు. తప్పని పరిస్థితిలో రత్తి వాళ్ళ తండ్రి భూస్వామి దగ్గరకు పంపిస్తాడు. అప్పటి నుంచి రత్తిని 'ఆఠానా', 'ఆఠానా" అని పిలవడం మొదలెట్టారు. అప్పటి నుంచి రత్తి ఎవరి దగ్గరైన 'ఆఠానా' ఇస్తే వెళ్తుంది. రవి ఆమెను తను ఎప్పటి నుంచో ప్రేమిస్తున్నాడు. పట్టణం నుంచి వచ్చిన ప్రతిసారి ఏదో ఒక వంకతో రత్తి వాళ్ళ ఇంటికి వెళ్ళేవాడు. కానీ, ఈ విషయం తెలిసి ఆశ్చర్యపోతాడు రవి.

ఓ రోజు రవి కూడా రత్తితో సంగమంలో పాల్గొంటాడు. చేతిలో 'చారానా' పెట్టి వచ్చేస్తాడు. అది చూసి రత్తి 'ఆఠానా' నుండి 'చారానా' అని పెద్దగా నవ్వుతుంది. అలా కొన్ని రోజుల తరువాత రత్తి విలువ 'చారానా'కి పడిపోతుంది. ఆమెను 'చారానా, చారానా" అని పిలుస్తారు.

చివరికి రత్తి ఎవరినో ఇంకా తక్కువ కులస్తుడిని ఉంచుకున్నందుకు, తనతోనే కలిసి తింటున్నందుకు గ్రామ ప్రజలంతా కలిసి ఆ ఇద్దరిని చెట్టుకు కట్టేసి, రత్తిని కట్టెలతో, రాళ్ళతో కొడతారు. రత్తి ఆ అవమానంతో రాత్రికి బావిలో పడి ఆత్మహత్య చేసుకుంటుంది. ఇది చూసి గ్రామ ప్రజలంతా బాధ పడతారు.

రవి ఇదంతా రమేష్కి చెప్పుతాడు. సాయంత్రం రూంకి గుర్నాధం వస్తాడు. తన భార్యను రవి దగ్గరకు పంపుతానని చెప్తాడు. రవి ఒప్పుకోడు. అందరూ క్యాంటినికి వెళ్తారు. అక్కడ శ్రీశైలం, రెడ్డి గ్యాంగ్తో కూర్చుని ఉంటారు. వాళ్ళ పక్కనే రవి వాళ్ళు వెళ్ళి కూర్చుంటారు. వారిద్దరు గ్యాంగ్తో కొట్టుకుంటారు. పోలీసులు రావడంతో పారిపోతారు. రవికి దెబ్బతగులుతుంది. ఆ కోపంలో అతను ఓ దెబ్బ కొడతాడు.

ISSN: 3048-5908 Impact Factor:3.63(SJIF)
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, April, 2024, pp.27-33


అప్పటినుండి అతనికి ధైర్యం వస్తుంది. పిరికితనం పారిపోతుంది. చైతన్యవంతుడవుతాడు. రవి హాస్టల్ కి వచ్చి పడుకుంటాడు. ఇంతటితో నవల ముగుస్తుంది.

ఇక పాత్ర చిత్రణ దీనిలో రవి, రత్తి, ఉపేంద్ర ముఖ్య పాత్రలు.

**రవి**:

ఈ నవలలో రవి ప్రధాన పాత్ర. ఈ నవలంతా రవి జీవితంలో జరిగిన ఒక్కరోజు సంఘటన తీసుకుని రాసింది. రవి ఎలా సంఘర్షణ పడ్డాడో ఈ నవలలో ఉంది. విశ్వవిద్యాలయంలో రవికి ఎదురైన సంఘటనలు చిత్రించబడింది. రవి మంచి చెడుల మధ్య ఆశలు, అపోహల మధ్య ఊహలతో నిరంతరం సంఘర్షించే ఓ పేద విద్యార్థి. ఆత్మ సంఘర్షణపడే స్వభావం కలవాడు. రవి భయస్తుడు. ఇంట్లో తల్లిదండ్రుల దీనస్థితిని, తన చదువుకోసం తల్లిదండ్రులు ఖర్చులను తలచుకుని బాధపడే సున్నితమైన మనసు గల్గినవాడు. రత్తిని ప్రేమిస్తాడు. పెళ్ళి చేసుకోవాలనుకుంటాడు. ఊరిలో తనకున్న మంచి పేరును కాపాడుకోవడం కోసం ఆ ప్రయత్నం మానుకుంటాడు. రత్తిని, రవి చివరికి అందరు చూస్తున్నట్లే తనూ చూస్తాడు. తన మనసులో సంఘర్షణ చెందుతాడు. చదువుకోవాలని అనుకుంటాడు. కానీ, ఆలోచనల పరంపరలు మనసులో మసులుతూ ఉంటాయి. కిరణ్మయితో సినిమాకు వెళ్తాడు. సతీష్ , కిరణ్మయి వెళ్ళిపోతుంది. ఆకలితో దొంగతనం చెయ్యాలని అనుకుంటాడు. చివరికి క్యాంటిన్లో జరిగే గొడవ వల్ల ధైర్యం తెచ్చుకుంటాడు. విప్లవం చేసినట్లు, తిరుగుబాటు చేసినట్లు, చైతన్యం తెచ్చుకొని సంతోషపడతాడు.

**రత్తి:**

రత్తి ఒక తక్కువ కులానికి చెందిన మహిళ. 12వ ఏడు వచ్చినప్పటి నుండి ఆమె రవికి తెలుసు. రవిని ఆమె అందం ఆకర్షిస్తుంది. నిరంతరం ఆమె కోసం తపిస్తూ ఉంటాడు. కానీ, ఆమె తనను ఎంతగా ఆహ్వానించినా రవి వశం కాడు. రవి పిరికివాడు. భయస్తుడు. తనకున్న మంచిపేరు పోతుందని భయపడతాడు. దగ్గర కాలేకపోతాడు. పెళ్ళి చేసుకోవాలని అనుకుంటాడు. భయంతో చేసుకోడు.

కొన్నాళ్ళకి ఆమెను ఒక దుష్ట భూస్వామి చెడగొట్టగా, ఆమె రోజుకొకరి చేత అనుభవించబడి ఆరానా, చారానాకు దిగజారిన దౌర్భాగ్యురాలు. అందుకు తానే కారణమనే ఒక 'నేరస్థ భావన' రవిలో కల్గుతుంది.

రత్తి ఆ ఊళ్ళో ఒక హరిజన యువకునితో సంబంధం పెట్టుకుంటుంది. ఇప్పటిదాకా సహించిన ఊరి వాళ్ళు. ఇది సహించలేకపోతారు. రత్తి బరితెగించిందని ఆ ఊరి మనుషులే చివరికి రాళ్ళతో, కర్రలతో కొడతారు. చివరికి రక్త చనిపోతుంది.

**ఉపేంద్ర:**

రవికి ఇష్టమైన గురువు. ఇతను రవికి వరంగల్లో పాఠాలు చెప్పినవాడు. తన సిద్ధాంతాలను గట్టిగా నమ్మేవాడు. ఎవరిని మోసం చేసే స్వభావం కాదు. హాని కల్గించే మనసు కాదు. సత్యాన్ని నమ్మేవాడు. హైదరాబాదులో వచ్చిన తరువాత తన మనసును చంపుకున్నాడు. తన సిద్ధాంతాలను పక్కన పెట్టినాడు.

**శైలి:**

ఈ నవలలో భాష చాలా సరళంగా ఉంది. మనిషితో మాట్లాడకుండా మనసులో జరిగే సంఘర్షణ ద్వారా మాటలు వేగంగా వస్తాయి. ఈ నవల చదివితే 'మనం మనతోనే' మాట్లాడుతున్నట్లు అనిపిస్తుంది. అక్కడక్కడ 'మణి ప్రవాళం' కూడా కనబడుతుంది. కానీ, మనకు అంతగా అనిపించదు. నిత్య జీవితంలో వాడే మాటలనే రచయిత ఈ నవలలో వాడాడు.

మనిషి పుట్టడంతోనే ఏడుపు మొదలెడుతాడు. కారణం ఆకలి. ఆ ఆకలితోనే మనిషి తన జీవితాన్ని తనకు కావలసిన విధంగా తీర్చుకుంటాడు. తన జీవిత నిర్మాణం మొదలవుతుంది. అందుకే అంటారు "కూటి కొరకు కోటి విద్యలు", "బారెడు పని చేసిన జానెడు పొట్ట కోసమే" అని ఎన్ని విద్యలు నేర్చుకున్న ఆకలి తీర్చుకోడానికే. ఆకలి అనేది అందరికి ఉంటుంది. ఒక్కొరికి ఒక్కొక్క విధంగా ఉంటుంది. ఇంత వరకే ఉంటుందని గిరిగీసి చెప్పలేం. ఇదే ఆకలి 'అంపశయ్య' నవలలో సైతం ప్రధానంగా చిత్రించబడింది. ఆకలి వల్లనే మనిషి మూర్ఖత్వంగా, దొంగతనంగా, అమాయకత్వంగా

ISSN: 3048-5908 Impact Factor:3.63(SJIF)
A Peer-Reviewed Telugu Journal; Volume-1, Issue-1, April, 2024, pp.27-33

కనబడతాడు. ఈ ఆకలి అనేక విధాలు. కొందరికి డబ్బులు సంపాదించాలనే ఆకలి. రాజకీయాలలో ఎదగాలనే ఆకలి. ఫోటోగ్రఫీ ఆకలి. బాగా చదువుకోవాలనే ఆకలి. ప్రేమ ఆకలి. సెక్స్ ఆకలి. ఉద్యోగం సంపాదించాలనే ఆకలి. దొంగతనం చేయాలనే ఆకలి. చంపేయాలనే ఆకలి. నిజమైన ఆకలి.

దీనిలో రవి విశ్వవిద్యాలయంలో పడిన కష్టాలను, మెస్లో తనకు డబ్బు కట్టకుంటే అన్నం పెట్టమని చెప్పడం. ఆ ఆకలి బాధతో ఖాన్సాబ్ మెస్లో హెడ్కుర్ని చంపేయాలని అనుకోవడం. కిరణ్మయి సతీష్ వెళ్ళిపోయినప్పుడు రవి తిరిగి వస్తాడు. అప్పుడు రవికి ఆకలి బాగా అవుతుంటుంది. ఆ పరిస్థితిలో హోటల్కి వెళ్ళి అన్నం తిని బిల్ కట్టకుండా పారిపోవాలని, ఒక పండ్లబండి దగ్గర నిలబడి ఆపిల్ ఎత్తుకుని ఎవరికి దొరకకుండా పరిగెత్తాలని మనసులో పలువిధాలుగా అనుకుంటాడు. అదంతా తనూ ఆకలి వల్లనే అనుకున్నాడు. రవికి ఆకలి వేయడం వల్లనే ఈ ఆలోచనలన్నీ వచ్చాయి.

బస్టాండులో ఉండే పిచ్చిదానికి ఆకలి. అందరిని జాలిచూపులతో చూస్తుంది. ఎవరు అన్నం పెడతారని. రమేష్ ఫోటోగ్రాఫర్. తనకు నూడ్స్ ఫోటోలంటే మహాఇష్టం. ఆ పిచ్చిదాని ఆకలిని గమనించి తనకు కావలసిన నూడ్స్ ఫోటోలు తీసుకుంటాడు. ఆ పిచ్చిది తన ఆకలి తీర్చుకోవడం కోసం ఒప్పుకుంటుంది. రమేష్ ఆమెకు ఇడ్లీలు ఇచ్చి తనకు కావలసిన నూడ్స్ ఫోటోలు గ్రంథాలయం వెనక తీసుకుంటాడు. ఆకలి ఏ స్థితికైనా దిగజార్చుతుంది.

కొందరికి సెక్స్ ఆకలి. అదే విశ్వవిద్యాలయంలో ఉండే క్లర్క్ ఆ పిచ్చిదాని చూసి తన మనసులో కోరికను తీర్చుకోవాలనుకుంటాడు. చెడుతలంపుతో ఆ పిచ్చిదానిని కామవాంఛతో చూస్తాడు. ఒక రూపాయి ఇస్తానని చెప్పి, తన పని కానించుకుని చేతిలో పావల పెట్టి వెళ్ళిపోతాడు. ఆ పిచ్చిది తనకేమి తెలియనట్లు వెర్రిచూపులు చూస్తుంది. ఆకలి కోసం మనిషి ఏ పనికైనా సిద్ధపడతాడు. ఇలా దీనిలో నవీన్ ఆనాటి సమాజంలో 'ఆకలి'ని రవి పాత్ర ద్వారా 'అంపశయ్య'లో ఇతివృత్తంగా తీసుకున్నట్లు గమనించవచ్చు.

**ముగింపు:-**

ఈ నవలలో విద్యార్థి నిజజీవితం వస్తువు. అలాగే ఎదురయ్యే సంఘటనలు, సంఘర్షణలన్నీ కళ్ళముందు యదార్థంగా వర్ణించబడ్డాయి. విశ్వవిద్యాలయంలో చదివే విద్యార్థి జీవితాన్ని చిత్రించిన తెలుగు నవలగా ఈఅంపశయ్యను చెప్పవచ్చు. ఈ విశ్వవిద్యాయంలో ఒక్కొక్కరు ఒక్కొక్క పద్ధతి, సిద్ధాంతం కలిగి ఉంటారు. ఈ చిన్న సమాజంలో గెలిచి బయటపడితే లోకాన్ని గెలిచినట్లే. విశ్వవిద్యాలయం జీవితానికి దిశానిర్దేశం చేస్తుంది. ఇక్కడే ప్రతి విద్యార్థి బ్రతుకు పాఠాలు చదివి, కష్టాలు చవిచూసి భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటారని ఈ నవల మనకు బోధిస్తుంది.

**సంప్రదించిన గ్రంథాలు:**

1. నవీన్, అంపశయ్య. 'అంపశయ్య' నవల, ప్రత్యూష ప్రచురణలు, వరంగల్, 1969.
2.రామ మోహనరాయ్. కడియాల, 'మన తెలుగు నవలలు', అజోవిభో కందాళం ఫౌండేషన్, 2012.
3.రామకృష్ణ రావు, వై. 'ఆధునికాంధ్ర సాహిత్యంలో చైతన్యస్రవంతి', హైదరాబాద్, 1987.
4.రంగనాథచార్యులు, కె.కె. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు, ఆంధ్ర సారస్వత పరిషత్, హైదరాబాద్,1982
5.శ్రీరామమూర్తి, కోడూరి. తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ, 1979.